క్లుప్తంగా

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



సతివాడలో ప్రచారం చేస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

నెల్లిమర్ల రూరల్: ఆషాఢ గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని సతివాడ, ఒమ్మి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని భక్తులు గురువారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీతపై విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శంకరరావు, సభ్యులు రాజప్పడు, ఉపేంద్ర గీతారాణి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



బాబాను దర్శించుకుంటున భక్తులు

పూసపాటిరేగ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సాయిబాబా భక్తుడు బొడ్డు విజయరామయ్య అన్నారు. మండలంలోని నక్కానపేటలో షిర్డీసాయి ఆలయంలో గురువారం సత్సంగం నిర్వహించారు. ఆషాఢ ఏకాదశి కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తోటివారికి సహాయం చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

నేడు ప్రజావేదిక

గజపతినగరం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీల ప్రజావేదికను ఈనెల 30న ఉదయం 10గంటలకు పాతమండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ తెలిపారు. మండలంలో 30 గ్రామ పంచాయతీలకు సంబంధించి 01.04.2022 నుంచి 31.03.2023 వరకు చేపట్టిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్ పనులు, ఎస్ఎస్ఏ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆ నివేదికలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు చెప్పారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

బొండపల్లి: ప్రధాన మంత్రి కిసాన్ యోజన కోసం అర్హులైన ప్రతీ రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.వి.మల్లికార్జునరావు సూచించారు. ఈకేవైసీ పూర్తికాని రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ డబ్బులు జమకావని తెలిపారు. రైతులు ఈనెల 30వ తేదీ సాయంత్రంలోగా గ్రామ వలంటీర్లు, ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు వస్త్రాలు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌బాబు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం సమీపంలో ఉన్న శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఆర్థిక సహాయకులు కొసరాజు వెంకటపూర్ణచంద్రరావు జ్ఞాపకార్థం గురువారం పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ 5 మంది దివ్యాంగులకు కృత్రిమ అయవాలు, వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచామని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రాజాపులోవలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను పట్టించుకోకుండా దాదాపు 600 హామీలను మేనిఫెస్టోలో పెట్టుకుని ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదన్నారు. ప్రతి విషయంలో రైతులకు పెద్దపీట వేశామని చెప్పుకునే చంద్రబాబు రైతు రుణమాఫీ విషయంలో అన్నదాతలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం వరకు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలే సాక్షిగా రానున్న ఎన్నికలకు వెళ్తామని, ప్రజలందరూ ఓటుతో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ కిలారి స్వప్న, పడాల భానుప్రకాష్, వైస్ ఎంపీపీ రావాడ బాబు, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, కొల్లు రామ్మూర్తి, కిలారి వెంకటరమణ, అపురభక్త పైడినాయుడు, రిక్క అప్పలనరసయ్య, కర్రోతు వెంకటరమణ, శ్రీనివాసరావు, పతివాడ రామకృష్ణ, కొండపు కొత్తయ్యరెడ్డి, సూరాడ చిన్నారావు, తహసీల్దార్ సీహెచ్ బంగారురాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఏపీఓ ఆదిబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సంగీతవిభావరిలో మాట్లాడుతున్న నాలుగెస్సుల రాజు, తదితరులు

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో గురువారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహుతులను అలరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నాలుగెస్సుల రాజు మాట్లాడుతూ.. ఘంటసాల, ఎస్పీ బాలు వంటి మహనీయులు పాడిన పాటలు ఎప్పటికీ ప్రతిఒక్కరి మదిలో చిరస్థాయిగా ఉండిపోతాయన్నారు. అద్భుతమైన గాత్రంతో మంత్రముగ్ధుల్ని చేయగలిగే మహత్తు వారి పాటల్లో ఉందన్నారు. అటువంటి పాటలను ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు సారథ్యంలో మళ్లీ వినడం మనందరి అదృష్టమని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ వాయిద్యకారులు సాయి, పవన్, సంస్థ ప్రతినిధులు ధవళ సర్వేశ్వరరావు, ఉప్పు ప్రకాష్, వైవీపీ సత్యనారాయణ, గ్రంధి విష్ణుమూర్తి, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

- జాబితా విడుదల చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం



ఎస్‌వీవీ రాజేష్



ఆశపు వేణు



ఎస్.బంగారునాయుడు



బైరెడ్డి ఎర్రప్పల నారాయణ రెడ్డి



సారిక గౌరీశంకర్



మహంతి శ్రీనివాసరావు



మజ్జి గణేష్



గదల సన్యాసి నాయుడు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం జాబితా విడుదల చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్‌గా ఎస్‌వీవీ రాజేష్.. విజయనగరం మండల ఇన్‌చార్జ్‌గా మజ్జి అప్పారావు.. కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లకు జేసీఎస్ ఇన్‌చార్జులుగా ముద్దాడ మధు, సంగంరెడ్డి బంగారునాయుడు, లక్ష్మణ్, కేవీఎన్ తమ్మన్నశెట్టి, ఆశపు వేణులను నియమించారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల రూరల్: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు జేసీఎస్ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. నెల్లిమర్ల నగర పంచాయతీ జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా మజ్జి గణేష్.. నెల్లిమర్ల (గ్రామీణ) ఇన్‌చార్జ్‌గా గదల సన్యాసినాయుడు.. భోగాపురం ఇన్‌చార్జ్‌గా బైరెడ్డి ఎర్రప్పలనారాయణ రెడ్డి.. డెంకాడ ఇన్‌చార్జ్‌గా సారిక గౌరీశంకర్.. పూసపాటిరేగ ఇన్‌చార్జ్‌గా మహంతి శ్రీనివాసరావు నియమితులయ్యారు.

ప్రతి గడపకూ సంక్షేమం..



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని, ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట పట్టణంలో సచివాలయం-3 పరిధిలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్ నేతృత్వంలో గురువారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంకా ఎవరైనా అర్హులు పథకాలు పొందనట్లయితే వారిని గుర్తించి పథకాలు అందించేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమానికికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. జూన్ 1వ తేదీ నుంచి గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం రాకుండా చూసుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, మండల ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, మెరపుల సత్యనారాయణ, గొర్లె రవికుమార్, వాకాడ రాంబాబు, ఎస్.చంద్రరావు, వాకాడ సతీష్, డి.పార్వతి, కొటాన ఈశ్వరి, మోపాడ కోటి, మజ్జి శేఖర్, షేక్ అమానుల్లాఖాన్, గనివాడ శ్రీను, నిరుజోగి శ్రీనివాస్, గణేష్, ఈశ్వరరావు, కె.అప్పయ్య, కె.జయశంకర్, ఎం.బుజ్జి, నాగరాజు, రమేష్, ఎస్.నాగరాజు, వై.అప్పలసత్యం, అవతారం, పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కరరావు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు

డెంకాడ: రోగులకు గ్రామాల్లోనే వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారని, సిబ్బంది ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్. భాస్కరరావు తెలిపారు. మండలంలోని మోదవలస వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరోగ్య కార్యకర్త వెంకటలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ-ఆశ యాప్ మానటరింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలు ప్రతి రోజూ వారి చేసిన సర్వీస్‌ను ఈ-యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు, సలహాలు అందించడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ టి.గౌరీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.సూరిబాబు, ఎంహెచ్‌ఓ సీసీవీ సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సమస్త మానవాళికి శ్రేయోదాయకం



భగవద్గీత కథా సంపుటి పుస్తకం ఆవిష్కరిస్తున్న అశోక్ గజపతిరాజు, తదితరులు

విజయనగరం: శ్రీకృష్ణ పరమాత్మ ప్రవచించిన భగవద్గీత సమస్త మానవాళికి శ్రేయోదాయకమని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. తిలక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మయూర హోటల్‌లో గురువారం నిర్వహించిన భగవద్గీత కథా సంపుటి పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమానికి అశోక్ గజపతిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, లోక కల్యాణం కోసం భగవంతుడైన శ్రీకృష్ణుడు భగవద్గీతను మానవాళికి అందించారన్నారు. భగవద్గీతను పండితులు, పామరులు, పిల్లలు, పెద్దలు అందరూ చదివి మంచిగా నడుచుకుంటూ, సమాజంలోని మంచిని పెంచాలని సూచించారు. ఇలాంటి మహోన్నతమైన గ్రంథావిష్కరణలు సమాజంలో ప్రగతికి శుభసూచకమని తెలిపారు. ఇలాంటి రచనలు చేసిన గ్రంథకర్తలకు సమాజం ఎల్లవేళలా రుణపడి ఉంటుందన్నారు. ఆధ్యాత్మికవేత్త జ్ఞానకీర్తన ఈ పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో గురుస్వామి కందాళ సాయిబాబా, గ్రంథ రచయిత పీసపాటి రామమూర్తి శాస్త్రి, మయూర హోటల్ అధినేత యార్లగడ్డ బాబురావు, వాకర్స్ క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం, ఎస్ఎస్‌వీఆర్ఎం రాజు, పట్టణంలోని సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం సమీపంలో దార పైడితల్లిమ్మ గుడి వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై సీహెచ్.హేమంత్ ఆధ్వర్యంలో పోలీస్‌లు గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,13,920 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా పైడితల్లి ఆలయ వార్షికోత్సవం



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కార్పొరేటర్లు నారాయణస్వామి, ధనలక్ష్మి, తదితరులు



ప్రత్యేక అలంకరణలో ఉన్న బొగ్గులదిబ్బ పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: పట్టణంలోని బొగ్గులదిబ్బలో కొలువైన పైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో సుమారు ఐదువేల మందికి దాత రెయ్యి శంకరరెడ్డి ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు సుంకర నారాయణస్వామి, బోనెల ధనలక్ష్మి, కమిటీ సభ్యులు వాసు, మురళి, రమేష్, రాము, తదితరులు, పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఆషాఢ మాస తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని పట్టణంలోని వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అరుంధతీనగర్‌లో కొలువైన వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రాజేష్‌కుమార్ నేతృత్వంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అదేవిధంగా టీటీడీ ప్రాంగణంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు పీవీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా స్వామివారికి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రూ.5.5 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండంలోని మల్లివీడు గ్రామంలో మండల పరిషత్ నిధులు, శ్రీసత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్స్ వెల్ఫేర్ సంయుక్తంగా చేపట్టే వాటర్ ప్యూరిఫైయింగ్ ప్లాంట్(ఆర్వో ప్లాంట్) నిర్మాణానికి ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. జలామృతం కార్యక్రమంలో భాగంగా సత్యసాయి ట్రస్ట్ వారు ప్లాంట్ నిర్మాణానికి రూ.2.5 లక్షలు అందజేశారు. అలాగే మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు కేటాయించినట్లు ఎంపీపీ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున, గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై అసంతృప్తి

గజపతినగరం: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చి ఓపీ రాయమంటే ప్రాంతీయ ఆస్పత్రి సిబ్బంది రాయకుండా బయటకు పంపించేశారని సాలిపేట సర్పంచ్ గంట్యాడ పైడపునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి సిబ్బంది తీరుకు నిరసనగా ఆస్పత్రి ముందు విద్యార్థులతో కలిసి గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జ్యోతిరావు పూలె స్కూల్లో చేర్పించేదుకు వై.యశ్వంత్, ఎం.నాగచాద్విక్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఉదయం 11 గంటల 45 నిమిషాలకు ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చామని, ఓపీ రాయమని సిబ్బందిని అడిగితే సమయం అయిపోయిందని చెప్పి పొమ్మన్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సిబ్బంది వద్ద ప్రస్తావించగా.. సెలవు దినం కావడంతో 12 గంటల వరకే ఓపీ ఉంటుందని చెప్పారు.